
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

బుధవారం 22 మే 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.169	245	279
సూర్యాపేట	రూ.165	250	280
నల్లగొండ	రూ.166	252	286

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 25.0



ఎంజీయూ ఇన్‌చార్జి వీసీగా నవీన్‌మిత్తల్

- 15 జూన్ లేదా కొత్త వీసీ నియమితులయ్యేంతవరకు కొనసాగింపు
- నేడు ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డికి వీడ్కోలు

మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి (స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ) నవీన్‌మిత్తల్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. యూనివర్సిటీకి పూర్తికాలపు వైస్‌ఛాన్సలర్‌ను నియమించేంతవరకు నవీన్‌మిత్తల్ ఇన్‌చార్జిగా కొనసాగుతారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ప్రస్తుత వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్. గోపాల్‌రెడ్డి 2021, మే 24న బాధ్యతలు స్వీకరించారు. ఆయన పదవీకాలం ముగియడంతో, తాజాగా ఇన్‌చార్జి వీసీని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక యూనివర్సిటీలకు కొత్త వీసీలను నియమించే ప్రక్రియను చేపట్టింది. అందుకు సెర్చ్ కమిటీలను నియమించి దరఖాస్తులను కూడా స్వీకరించింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ పోస్టుకు 157మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారుల్లో సెర్చ్ కమిటీ ముగ్గురిని ఎంపికచేసి గవర్నర్‌కు నివేదిస్తే, ఆ ముగ్గురిలో ఒకరిని గవర్నర్ వైస్‌ఛాన్సలర్‌గా నియమిస్తారు. ఈసారి రాజకీయపరమైన నియామకం కాకుండా, యూనివర్సిటీల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా, పారదర్శకంగా పనిచేసే, అనుభవజ్ఞులైన వారిని వీసీలుగా నియమిస్తున్నారనే చర్చ సాగినా, ఆ ప్రక్రియ కొలిక్కిరాకపోవడం, ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అనివార్యంగా ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమించినట్లు యూనివర్సిటీ వర్గాల్లో చర్చ సాగుతోంది.కొత్తవీసీ నియమితులయ్యేంతవరకు లేదా 15 జూన్ వరకు నవీన్‌మిత్తల్ ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. వీసీగా పదవీ కాలం పూర్తిచేసిన గోపాల్‌రెడ్డికి బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ అల్వాల రవి తెలిపారు.

పూర్తికాలపు వీసీలు నలుగురే


మహాత్మాగాంధీ యూనివర్సిటీ 2007లో ఏర్పాటు కాగా, ఇప్పటి వరకు 14 మంది వీసీలుగా పనిచేశారు. వీరిలో నలుగురే పూర్తిస్థాయి వైస్‌చాన్సలర్లుగా నియమితులై పూర్తి పదవీకాలం పనిచేశారు. మొదటి వీసీగా ప్రొఫెసర్ వి.గంగాధర్ 2007-2010 వరకు మూడేళ్లు పనిచేయగా, ఆ తర్వాత ప్రొఫెసర్ కె.నరసింహారెడ్డి 2011-2014 వరకు పనిచేశారు. తదుపరి 2016-2019 వరకు ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ వీసీగా పనిచేయగా, 2021 నుంచి ఇప్పటివరకు ప్రొఫెసర్ సీహెచ్.గోపాల్‌రెడ్డి పదవీబాధ్యతలు నిర్వహించారు. మిగిలిన కాలంలో ఐఏఎస్ అధికారులు, ఇతర యూనివర్సిటీల వైస్‌ఛాన్సలర్లను ఇన్‌చార్జి వీసీలుగా నియమించి పాలన కొనసాగించారు. నవీన్‌మిత్తల్‌కు ముందు సీనియర్ ఐఏఎస్ అధికారులు కె.సునీత, శైలజారామయ్యర్, ఏ.వాణీప్రసాద్, టి.విజయ్‌కుమార్ ఎంజీయూకు ఇన్‌చార్జి వీసీగా పనిచేశారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోని ఎంజీయూ లాంటి యూనివర్సిటీల్లో వీసీ స్థాయి నుంచి అన్ని స్థాయిల అధికారుల నియామకాలతో పాటు, నిధుల కేటాయింపుల్లో, విద్యాపరంగా బలోపేతం చేయడంలో ప్రభుత్వం చిన్నచూపు ప్రదర్శించిందనే విమర్శలు ఉన్నాయి. రాజకీయ ప్రమేయంతో పోస్టింగులిచ్చారే తప్ప యూనివర్సిటీల ప్రయోజనాలు పట్టించుకోలేదనే ఆరోపణలూ ఉన్నాయి. ఈ ప్రభుత్వంలోనైనా యూనివర్సిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసే వైస్‌చాన్సలర్ నియామకం ఉండాలని అంతా ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి వీసీగా నియమితులవ్వడంతో యూనివర్సిటీ పాలనపై నవీన్‌మిత్తల్ దృష్టి సారిస్తారా? లేక నామమాత్రంగా కొనసాగుతారా? అనే చర్చ యూనివర్సిటీ వర్గాల్లో సాగుతోంది. యూనివర్సిటీలో నెలకొన్న పలు సమస్యలపై ఇన్‌చార్జి వీసీ దృష్టి సారించాలని, అన్ని విభాగాలపైనా సమీక్ష జరిపి గాడిన పెట్టాలని విద్యార్థి సంఘాలు, ఉద్యోగులు కోరుతున్నారు.



లోక్‌సభ ఎన్నికలు పూర్తి

కాగా, ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక హడావుడి కొనసాగుతోంది. నాలుగు నెలలుగా రాజకీయ వర్గాలు, అధికారులు ఎన్నికల వాతావరణంలోనే నిమగ్నమయ్యారు. రాజకీయ పార్టీలు సైతం ఇటీవల జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడాయి. మరోవైపు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజకీయ నాయకులకు గుక్కతిప్పుకోని పరిస్థితి నెలకొంది. అయితే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పూర్తికాగానే, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



మరో పోరుకు సన్నాహాలు

- త్వరలో మోగనున్న పంచాయతీ నగారా
- ఎన్నికలెప్పుడైనా రావొచ్చని సంకేతాలు
- లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం నోటిఫికేషన్‌కు అవకాశం
- ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ప్రభుత్వం సూచన
- ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సుల సేకరణ
- పక్క రాష్ట్రాల నుంచి తెప్పించనున్న అధికారులు

అసెంబ్లీ, పార్లమెంటు, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అనంతరం నేతలంతా కాస్త ఊపిరి పీల్చుకుందామని అనుకుంటుండగానే, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని అధికార పార్టీ అధిష్ఠానం అంతర్గతంగా ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. దీంతో రాజకీయ నేతలు ఊపిరి తీసుకోకుండా వెనువెంటనే ఎన్నికలకు సిద్ధం కావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా జరిగే ప్రతీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొంటూ, గ్రామాల్లో పట్టు నిలుపుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి నాలుగు నెలలు కావొస్తోంది. ప్రస్తుతం పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. 2024 జనవరి 31తో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియగానే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఎన్నికలకు వాయిదా వేసి, ప్రత్యేక పాలన వైపు మొగ్గు చూపింది. మరోవైపు బీసీ జనగణనను కూడా పూర్తి చేయాలని ప్రభుత్వం యోచించింది. వీలైనంత త్వరగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పంచాయతీలకు పాలకవర్గాలు ఉంటే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి అభివృద్ధి నిధులు మంజూరవుతాయి. ప్రత్యేక అధికారుల పాలన ఉంటే నిధులు నిలిచిపోతాయి. అసలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో, కేంద్ర నిధులు కోల్పోవడం కంటే ఎన్నికలు నిర్వహించడం మేలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో జూన్ నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా వెలువడవచ్చని, అందుకు జిల్లా యంత్రాంగాలు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల సంఘం అంతర్గత సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. గ్రామపంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతో నిర్వహిస్తారు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పక్కనున్న రాష్ట్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకువస్తుంటారు. జిల్లాల వారీగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి బ్యాలెట్ బాక్సులను తెప్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు జిల్లాల్లో ఉన్న బ్యాలెట్ బాక్సులు ఎన్ని? ఇంకా ఎంతమేర కు బాక్సులు అవసరం? పక్కనున్న రాష్ట్రా నుంచి ఎన్ని బాక్సులను తెప్పించాలన్న అంశాలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించింది. ఏ జిల్లాలకు ఎక్కడెక్కడి నుంచి బ్యాలెట్ బాక్సులను తెప్పించాలనే విషయం పై చర్చించింది. ఈ మేరకు జిల్లా అధికారులు బ్యాలెట్ బాక్సులను తెప్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,740 పంచాయతీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 844 పంచాయతీలు, సూర్యాపేటలో 475 పంచాయతీలు ఉన్నాయి. యాదాద్రి జిల్లా లో 421 గ్రామపంచాయతీలు ఉండగా, 3,666 వార్డులు ఉన్నాయి. ఒక్కో గ్రామపంచాయతీ పరిధిలో ఆరు నుంచి 12వార్డులు ఉన్నాయి. అన్ని వార్డులకు ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారితో పాటు సిబ్బందిని నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది నియమాకంపై జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై త్వరలో జిల్లా అధికారులు చర్చించనున్నారు. ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఇటీవల శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన సిబ్బందిని పంచాయతీ ఎన్నికల్లో వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం యోచిస్తోంది. ఈ మేరకు ప్రిసైడింగ్, పోలింగ్ అధికారుల జాబితాపై కసరత్తు ప్రారంభించింది.

మూడు దశల్లో ఎన్నికలు

గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రతీ జిల్లాలో మూడు దశల్లో నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ ఇటీవల ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు సర్క్యులర్ జారీచేసింది. మూడు దశలకు సంబంధించి ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులకు నియామకానికి జాబితా పూర్తిచేసి ఎన్నికల కమిషన్‌కు అందించాలని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలోని 1,740 గ్రామపంచాయతీలకు వార్డుల వారీగా పోలింగ్ అధికారుల నియమాకంతో పాటు ఎన్నికల సిబ్బందిని అదనంగా నియమిస్తారు. ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ పోలింగ్ పర్సనల్ ర్యాండమైజేషన్ పేరుతో సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేసింది. ప్రభుత్వరంగ సంస్థలు, చట్టబద్ధమైన కార్పొరేషన్లు, ఎయిడెడ్ పాఠశాలల ఉద్యోగులను పోలింగ్ సిబ్బందిగా నియమించనున్నారు. ప్రిసైడింగ్ అధికారులుగా వీలైనంత వరకు గెజిటెడ్ ఉద్యోగులను నియమించనున్నారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం

పంచాయతీ ఎన్నికలకు ఓటర్ల జాబితాలు కూడా సిద్ధంగా ఉన్నాయి.ఇటీవల జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వినియోగించిన తుది జాబితా ఆధారంగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులను నియమిస్తారు. అయితే ముందస్తుగా అధికారుల నియమాకాలపై పూర్తి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి నివేదిక రూపంలో అందించాల్సి ఉంటుంది. అనంతరం వారికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1-200 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు మరొక పోలింగ్ అధికారి ఉంటారు. 201-400 మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401-650మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమిస్తారు. ఒక్కో గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమిస్తారు. ప్రతీ వార్డులో కనీసం ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు. ఒక వార్డులో 650మంది ఓటర్లు ఉంటే రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తారు. ఈ మేరకు పంచాయతీ పోలింగ్ అధికారుల నియామకం చేపట్టనున్నారు.



మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం

- డీసీవోకు అవిశ్వాస తీర్మానాన్ని అందజేసిన డైరెక్టర్లు
- ఉదయం నుంచి పలు నాటకీయ పరిణామాలు



మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్‌పై డీసీవోకు అవిశ్వాస తీర్మాన ప్రతిని అందజేస్తున్న వైస్‌చైర్మన్, డైరెక్టర్లు

మోత్కూరు, మే 21: మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రకటిస్తూ తొమ్మిది మంది డైరెక్టర్లు మంగళవారం జిల్లా సహకార అధికారి (డీసీవో) ప్రవీణ్‌కుమార్‌కు అవిశ్వాస తీర్మాన ప్రతిని అందజేశారు. సింగిల్ విండోలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, వైస్‌చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లుతో పాటు మరో ఎనిమిది మంది అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలు చేసి డీసీవోకు అందజేశారు. చైర్మన్ అశోక్‌రెడ్డి విధులు సక్రమంగా నిర్వహించకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడని, సంఘానికి చెందిన స్థలంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను పాలకవర్గం తీర్మానం లేకుండా తానే కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నారని, తీర్మానాలు లేకుండానే రూ.50లక్షలు డ్రా చేశారని డైరెక్టర్లు ఆరోపించారు. అదేవిధంగా సంఘం ఆధ్వర్యంలో అనాలోచితంగా నిర్మించిన పెట్రోల్ బంక్‌ను నడపకపోగా, బంక్ స్థలానికి నెలకు రూ.20వేలు అద్దె, వాచ్‌మెన్ వేతనం, విద్యుత్ బిల్లులు, మూలధనంపై వడ్డీ చెల్లిస్తూ సంఘానికి సుమారు రూ.కోటి నష్టం చేశారని, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహించడం ద్వారా వచ్చిన రూ.లక్షల ఆదాయాన్ని సంఘం సభ్యులకు తెలియకుండా దుర్వినియోగం చేశారని, సంఘంలో ప్రావీణ్యం లేని ఉద్యోగిని నియమించడం ద్వారా గతంలో కందుల కొనుగోలు సందర్భంగా జరిగిన అవకతవకల్లో డైరెక్టర్లకు తెలియకుండా మార్క్‌ఫెడ్‌కు రూ.7 లక్షలు సంఘం నుంచి చెల్లించి నష్టం కలిగించినందున అవిశ్వాసం ప్రకటిస్తున్నట్టు డీసీవోకు ఇచ్చిన తీర్మాన కాపీలో డైరెక్టర్లు పేర్కొన్నారు.

సింగిల్ విండోలో నాటకీయ పరిణామాలు

సింగిల్ విండోలో మంగళవారం పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం సింగిల్ విండో పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్ అశోక్‌రెడ్డి, డైరెక్టర్లు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య, దేవసరి రాములు తొలుత సమావేశానికి హాజరై సంతకాలు చేసి కొంత సేపు ఉండి వెళ్లిపోయారు. ఆ తర్వాత వైస్‌చైర్మన్‌తో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లు సమావేశానికి వచ్చారు. కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేసి చైర్మన్, వచ్చిన డైరెక్టర్లు వెళ్లిపోయారని సంఘం సిబ్బంది తెలిపారు. 10 నుంచి 20 నిమిషాలు ఆలస్యంగా వచ్చినంత మాత్రాన సమావేశాన్ని ఎలా వాయిదా వేస్తారని వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు సీఈవోను, సిబ్బందిని నిలదీశారు. కార్యాలయంలోనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రెండు సమావేశాలకు హాజరు కానంత మాత్రాన ఇద్దరు డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లుకు నోటీస్ ఇవ్వకుండా, పాలకవర్గ సమావేశంలో చర్చించకుండా తొలగించారని ఆరోపించారు. సమావేశానికి వచ్చిన డైరెక్టర్లతో ముందుగా సంతకాలు తీసుకుని, ఆ తర్వాత వారి ఇష్టమొచ్చినట్టుగా తీర్మానాలు రాసుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం వారు డీసీవో కార్యాలయానికి వెళ్లి డీసీవోకు అవిశ్వాస తీర్మానం అందజేశారు.

కోరం లేనందునే సమావేశం వాయిదా : చైర్మన్ అశోక్‌రెడ్డి

సమావేశానికి తనతో పాటు నలుగురు డైరెక్టర్లే వచ్చారని, కోరం లేనందునే సమావేశాన్ని వాయిదా వేసి వెళ్లిపోయామని సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు వరుసగా ఐదు సమావేశాలకు రానందున సహకార చట్టం ప్రకారం వారిని తొలగించి, డీసీవోకు నివేదిక ఇచ్చామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను పాలకవర్గం తీర్మానం మేరకు సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామన్నారు. వారు చేసిన ఇతర ఆరోపణలన్నీ అవాస్తవాలన్నారు. రాజకీయలబ్ధి కోసం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

• వైభవంగా శ్రీరామ అలంకార సేవ



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం కాళీయమర్దనుడిగా శ్రీకృష్ణ అలంకారంలో, రాత్రి శ్రీరామ అవతారంలో హనుమ వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. 7

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, మే 21: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 3,682 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,297మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. 16 కేంద్రాలకు 16మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు (డీవో), ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స, అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించాలన్నారు. అదేవిధంగా, పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మారుమూల గ్రామాల నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను నడపాలని, పరీక్ష పత్రాలను ప్రొటోకాల్ ప్రకారం తపాల శాఖ తరలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఇంటర్ నోడల్ అధికారి సి.రమణి, పరీక్షల కో-ఆర్డినేటర్ అరుంధతి, తపాల అధికారి పి.బాలనరేష్, అధికారులు డాక్టర్ వంశీకృష్ణ, కే.కృష్ణారెడ్డి, సత్యప్రకాష్, కే.పార్థసింహారెడ్డి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి వైన్ షాపులు బంద్

ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వైన్‌షాపులు, బార్లు, కల్లు డిపోలు మూసివేయనున్నట్టు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 25 సాయంత్రం 4గంటల నుంచి 27 సాయంత్రం 4గంటల వరకు వైన్‌షాపులు బంద్ పాటించాలన్నారు. లేదంటే ఎక్సైజ్ యాక్ట్ 1968 సెక్షన్ 20(1) ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఓ బ్లాక్ మెయిలర్

- అతడిపై 56 క్రిమినల్ కేసులు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నల్లగొండలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నల్లగొండ, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న వ్యక్తి ఓ బ్లాక్ మెయిలర్ అని, అతడికి మద్దతుగా ఓటు వేయించే విషయంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడి ఆలోచించుకోవాలని, లేదంటే వారికే ఎసరు పెడతాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పొద్దున లేస్తే బూతుపురాణాలు మాట్లాడే అభ్యర్థిని మండలికి పంపితే ఎంత ప్రమాదమో ప్రతీ ఒక్క పట్టభద్రుడు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిపై 56 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. బూతు మాటలు, బెదిరింపులు, బ్లాక్ మెయిల్ చేస్తూ పెద్దలను తిడితే పెద్దవాడిని అవుతానన్న భావనతో ఉన్న వ్యక్తిని మండలికి పంపించవద్దన్నారు. ప్రభుత్వానికి బాకా ఊదే వ్యక్తిని కాకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తిని ఎన్నుకోవాలని కోరారు. సన్న ధాన్యానికి మాత్రమే రూ.500బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్న ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో 85శాతం వరకు దొడ్డు రకాలు సాగవుతాయని, వాటికి బోనస్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఐదు నెలలోనే అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాల అపఖ్యాతిని కూడగట్టుకుందన్నారు. గత ప్రభుత్వం 30వేల ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చి రాత పరీక్షలు నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తామే ఆ ఉద్యోగాలు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటోందన్నారు. మెగా డీఎస్సీ వేస్తామని, 2లక్షల ఉద్యోగాలని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులంతా సరైన సమాధానం చెప్పాలన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టభద్రుల ఉప ఎన్నికలో పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎన్నికల సమయంలోనే కనిపిస్తాడని, కాంగ్రెస్ అభ్యర్థి ప్రశ్నిస్తానన్నా గొంతును సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటాడని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నా రు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, నాయకులు ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన ఏడుగురి రిమాండ్

- మాయమైన 31 పశువుల కంటెనర్లపై స్పష్టత కరువు
- స్పందించడానికి నిరాకరిస్తున్న కొండమల్లేపల్లి పోలీసులు

నల్లగొండ, మే 21 : నాలుగు రోజుల క్రితం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో గోవులు, పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను అటకాయించి అక్రమ వసూళ్లకు పాల్పడిన ఏడుగురు వ్యక్తులను మంగళవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు సోషల్ మీడియా రిపోర్టర్లతో పాటు నలుగురు కొండమల్లేపల్లి సంతలో పనిచేసే వ్యక్తులపై అక్రమ వసూళ్లకు పాల్పడిన విషయంలో పోలీసులు దేవరకొండ కోర్టుకు తరలించగా వారికి కోర్టు రిమాండ్ విధించింది. ఇదిలా ఉండగా లారీలను ఆపి వసూళ్లకు పాల్పడిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపించే వరకు బాగానే పనిచేసిన కొండమల్లేపల్లి పోలీసులు అక్రమంగా పశువులను తరలించిన మాయమైన కంటైనర్ల విషయంపై మాత్రం ఏమాత్రం స్పందించడంల లేదని చర్చ సాగుతోంది. శనివారం ఏపీలోని శ్రీకాకుళం, అన్నవరం నుంచి 32 కంటైనర్లలో అక్రమంగా పశువులు తరలించిన విషయం తెలిసిందే. అయితే ఇందులో ఒక వాహనం మాత్రం దేవరకొండ పోలీసులకు చిక్కడంతో ఈ అక్రమ వసూళ్ల బాగోతం బయటపడింది. అయితే అసలు విషయం అంతా మరో 31 కంటైనర్లు ఎక్కడ మాయమయ్యాయి. ఎక్కడికి ఆ పశువులను తరలించారో అనే విషయంలో కొండమల్లేపల్లి పోలీసులు విచారణ ముమ్మరంగా సాగించడం లేదనేది తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం నల్లగొండ రైల్వేస్టేషన్‌లో 40 బాక్సుల జంతు మాంసం పట్టుబడిన విషయం తెలిసిందే. గుంటూరులో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో రెండు బోగీల్లో ఈ ఎద్దు మాంసాన్ని ఫిష్ బాక్స్‌ల పేరిట బోగిల్లో పెట్టి అక్రమంగా రవాణా చేస్తుండటంతో రైల్వే పోలీసులతో పాటు స్థానిక సివిల్ పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. ఇది జరిగిన కొద్ది రోజులకే ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, అన్నవరం నుంచి 32కంటైనర్లలో పశువులను అక్రమ రవాణా చేశారు. ఒక్కొక్క కంటైనర్‌లో 52 పశువులు ఉండగా మొత్తం అంతా కలిపి దాదాపు 1,664వరకు పశువులను అక్రమంగా ఇతర ప్రాంతాలకు చేరవేసినప్పటికిని కొండమల్లేపల్లి పోలీసులు కేసును సమగ్రంగా విచారించ లేకపోతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

పశువుల అక్రమ రవాణాపై స్పందించడానికి కొండమల్లేపల్లి పోలీసులు నిరాకరిస్తున్నట్లు సమాచారం. అయితే అక్రమ వసూళ్లకు పాల్పడిన ఏడుగురు వ్యక్తులను రిమాండ్ చేసినట్లు కొండమల్లేపల్లి ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

రేపు సాగర్‌లో బుద్ధ జయంతి

నాగార్జునసాగర్, మే 21 : అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో ఈ నెల 23న బుద్ధజయంతి నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2,570వ బుద్ధ జయంతి వేడుకలకు ఏర్పాట్లను మంగళవారం ప్రారంభించారు. జయంతి ఉత్సవాలకు పర్యాటక శాఖ ఎండీ, బుద్ధవనం ప్రత్యేక అధికారి రమేష్‌నాయుడు, వివిధ దేశాల బౌద్ధ మతస్తులు, మాంక్‌లు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

ఈదురు గాలులకు కోళ్లఫారాలు నేలమట్టం

త్రిపురారం మే 21 : నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం దుర్గానగర్‌లో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు రెండు కోళ్లఫారాలు నేలమట్టమయ్యాయి. బాధితురాలు వీరమళ్ల జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం ఎకరం విస్తీర్ణంలో ఐదేళ్ల కిందట ఏర్పాటు చేసిన రెండు కోళ్లఫారాలు ఈదురు గాలులకు కుప్పకూలాయి. ఆ సమయంలో కోళ్లు లేకపోవడంతోట షెడ్డులోని సామాగ్రి మాత్రమే ధ్వంసమైంది. సుమారు రూ.50లక్షల ఆస్తినష్టం జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని అమె కోరారు.

అవయవదానంతో అమరత్వం

- ఆరుగురికి జీవం పోసిన సుజాత


సుజాత(ఫైల్)

ఆలేరు రూరల్, మే 21 : మరణించి జీవించింది ఆమె. ప్రాణం వదులుతూ ఆరుగురికి అవయదానంతో ప్రాణదాతగా నిలిచింది. వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం బహద్దూర్‌పేటకు చెందిన జంపాల సుజాత(42) ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులకు అన్నం వడ్డిస్తూ కిందపడింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షల అనంతరం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో అవయవదానం చేసేందుకు అంగీకరించారు. దీంతో మంగళవారం ఉదయం ఆమెకు చెందిన గుండె, కళ్లు, లివర్, తీసుకొని ఆరుగురికి అమర్చారు. తాను మరణించి ఆరుగురికి జీవం పోసింది సుజాత. సుజాతకు భర్త దశరథతో పాటు కుమార్తె మానస, కుమారుడు సునీల్ ఉన్నారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం బహద్దూర్‌పేటలో నిర్వహించారు. సుజాత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత పరామర్శించారు. అవయవదానంతో అమరత్వం పొందిందని స్థానికులు అన్నారు.

తాటిచెట్టుపై నుంచి గీత కార్మికుడి మృతి


అంజయ్య(ఫైల్)

మునుగోడు రూరల్, మే 21 : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం ఉకొండి గ్రామంలో తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నకరి కంటి అంజయ్య(58) కల్లును గీసేందుకు చెట్టు ఎక్కుతుండగా మోకు ఉన్న గొలుసు తెగడంతో పైనుంచి పడి గాయపడ్డాడు. గమనించిన పక్కనే తాటి చెట్టు ఎక్కుతున్న సిద్ధమని సత్తయ్య కుటుంబ సభ్యులతో కలిసి అంజయ్యను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. అంజయ్య కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గ్రామ అటాచ్‌మెంట్ మాడ్యుల్‌పై అవగాహన

మిర్యాలగూడ రూరల్, మే 21 : సెంట్రల్ సెక్రటేరియేట్ సర్వీస్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ బృందం ఫౌండేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం కోసం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌ను సందర్శించింది. గ్రామ అటాచ్‌మెంట్ మాడ్యుల్‌పై అవగాహనలో భాగంగా గ్రామంలో పర్యటిస్తున్నారు. ఎంపీడీవో ఎం.శేషగిరిశర్మ, ఎంఈవో ఎం.బాలాజీనాయక్, ఎంపీవో పద్మ, వీరారెడ్డి, ఏపీవో కళావతిలు వారికి స్వాగతం పలికారు. గ్రామంలో వారు మూడు రోజులు పర్యటిస్తారని, గ్రామీణాభివృద్ధిపై అవగాహన, అధ్యయనం చేస్తారని ఎంపీడీవో తెలిపారు. మంగళవారం గ్రామంలో జనాభా, గృహాల సంఖ్య తాగునీటి సరఫరా, 24గంటల విద్యుత్ సరఫరా, గ్రామస్థుల జీవనోపాధి, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అమ్మ ఆదర్శ పాఠశాల ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులు కుట్టడం ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జీ అనిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భువనగిరి అర్బన్, మే 21: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురం శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం సాధువెల్లి గ్రామానికి చెందిన గోలి శ్రీనివాస్(38) మగ్గం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై మధ్యాహ్నం యాదగిరిగుట్టకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సైదాపురం శివారులో యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన జిల్లా భరత్ బైక్‌తో శ్రీనివాస్ బైక్‌ను వెనుక నుంచి అతివేగంతో బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో తలకు గాయమైన శ్రీనివాస్‌ను వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

సమ్మోహన రూపంలో.. సంరక్షకుడు



● కాళీయ మర్దనుడిగా నృసింహుడు ● రెండో రోజు జయంత్యుత్సవాలు



కళాకారిణి నృత్య ప్రదర్శన



స్వామి వారికి లక్షపుష్పార్చన


భువనగిరి అర్బన్, మే 21 : విష జలము తాగిన వారిని మరణం నుంచి కాపాడిన తీరు కాళీయ మర్దన లీలలో భక్తులను రక్షించి కాళీయుడి గర్వమణిచేందుకు శ్రీకృష్ణుడిగా, హనుమద్వాహన రూఢుడైన శ్రీరామచంద్రమూర్తిగా భక్తకోటికి యాదగిరీశుడు దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో మంగళవారం రెండో రోజు జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. కాళీయమర్దనుడిగా యాదగిరీశుడు శ్రీకృష్ణ అలంకరణలో వేద మంత్ర పఠనాలతో పూజలు చేపట్టారు. భక్తజనం పాల్గొనగా తిరువీధి సేవను ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిత్య ఆరాధనల అనంతరం ఉదయం నిత్యహవనములు, మూలమంత్ర జపాలు, లక్ష్మీసూక్త, శ్రీవిష్ణు సహస్ర పారాయణాలు, అభిషేకాలు, నవకలశస్నపనములతో పాటు స్వామిఅమ్మవార్లకు వివిధ పుష్పమాలికలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. రాత్రి వేళ సామూహిక పారాయణాలు, నృసింహ మూలమంత్ర హవనాలు, నిత్య పూర్ణాహుతి నిర్వహించి శ్రీరాముడి అలంకరణలో హనుమంత సేవ తిరువీధుల్లో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో స్వామివారి అలంకరణలు మినహా ఉదయం విశేషస్నపనం, నిత్యహవనం, నృసింహ మూలమంత్ర హనవం, లక్ష పుష్పార్చన రాత్రి నృసింహ మూలమంత్ర హవనం జయంత్యుత్సవాల్లో భాగంగా శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. వేడుకల్లో ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు దూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకులు రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, అశోక్, రామారావు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భక్తుల కోసం వైద్యశిబిరం

కొండపైన ప్రధాన కార్యాలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన రవీంద్ర లంగ్ కేర్ సెంటర్ వైద్యులు రవీంద్ర, ప్రవళిక ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా 200మంది సేవలు పొందారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభూవులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 47,74,123 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



ఎల్‌ఈడీ స్ర్కీన్లలో స్వామి సేవల ప్రసారం

ఉగ్రం వీరం గ్రంథం ఆవిష్కరణ

ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచన సంకలనం ఉగ్రం వీరం గ్రంథాన్ని దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏ భాస్కర్‌రావు ఆవిష్కరించారు. మొదటి గ్రంథాన్ని ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకులు హైదరాబాద్‌కు చెందిన లిటిల్ మ్యూజిక్ అకాడమీ చైర్మన్ రామాచారికి అందజేశారు. అనంతరం పురాణపండ శ్రీనివాస్‌కు ప్రత్యేక దర్శనాన్ని కల్పించారు.

సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తూ గిరి ప్రదర్శన

కొండకింద వైకుంఠద్వారం వద్ద సాంస్కృతిక విశ్వకళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కూచిపూడి నృత్య గురువులు రాంనర్సయ్య, ప్రసాద్‌రాయుడు, కూచిపూడి నృత్య కళాకారుని గాయత్రి, రాంపల్లి మేడ్చల్‌కు చెందిన బృందాలు జయంత్యుత్సవాలను పురస్కరించుకొని కొండచుట్టూ సాంస్కృతిక ప్రదర్శన ఇస్తూ గిరి ప్రదర్శన చేపట్టారు. ప్రతీ మాసం స్వాతి నక్షత్రం రోజున నృత్య ప్రదర్శన చేపడతామని వ్యవస్థాపక అధ్యక్షుడు రాం నర్సయ్య తెలిపారు.

ఆకట్టుకున్న సంగీత సభలు

స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా కొండపైన సంగీత సభలు నిర్వహించారు. యాదగిరిగుట్టకు చెందిన శ్రీయాదాద్రి భక్త భజన మండలి, శ్రీగాయత్రి మహిళ భజన మండలి ఆధ్వర్యంలో భజనలు, రాత్రి శారద సంగీత అకాడమీ, అన్నమాచార్య అకాడమీతో భక్తి సంగీతం, శివచంద్రలహరి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, నాగదుర్గ బృందంచే కూచిపూడి నృత్యం, ప్రముఖ గాయకులు ఎల్.ఎం.ఏ బాలగాంధర్వం వ్యవస్థాపకుడు రామాచారి ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి నిర్వహించారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న కళాకారిణులు

మట్టపల్లిలో ముగిసిన అధ్యయనోత్సవాలు

● రాత్రి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అధ్యయనోత్సవాల్లో భాగంగా శాత్తుమర్తై నిర్వహిస్తున్న రుత్వికులు

మఠంపల్లి, మే 21 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో అధ్యయనోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు తొళక్కంతో ప్రారంభమై, అధ్యయనోత్సవం, పరమపదోత్సవం, త్రయాహ్నికంగా చేపట్టిన ఉత్సవాలు మంగళవారం నిర్వహించిన శాత్తుమర్తైతో ముగిశాయి. అనంతరం బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్గ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురారోపణం, ధ్వజారోహణం, మంత్ర గ్రహణం, నవకుంభారోపణం, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం అర్ధరాత్రి వేళ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్దీపాల వెలుగులో ఆలయ ద్వారం

కాగితాలకే పరిమితమైన పారిశుధ్య ప్రణాళిక

చెర్వుగట్టు దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులు ఒక అడుగు ముందుకు, మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం ఏర్పాట్లపై చేపట్టిన సర్వే ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. అదేవిధంగా రాతిబండ తొలగింపు పనులు రెండు నెలలుగా నిలిచిపోయాయి.

● చెర్వుగట్టుపై డ్రైనేజీ వ్యవస్థ కోసం ఏడాదిన్నర కిందటే సర్వే పూర్తి

● రూ.1.93 కోట్ల అంచనాతో డీపీఆర్ తయారీ

● అమలుకు నోచని ప్రణాళిక

నార్కట్‌పల్లి, మే 21 : నల్లగొండ జిల్లా చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంపై పారిశుధ్య ప్రణాళిక కేవలం కాగితాలకే పరిమితమైంది. గుట్టపై మెరుగైన పారిశుధ్య వ్యవస్థ ఏర్పాటు కోసం సర్వే చేయించి తయారు చేసిన ప్రణాళిక దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా కార్యాచరణ దిశగా అడుగులు పడటంలేదు. దేవస్థానంలో పారిశుధ్య లోపంపై తరుచూ భక్తుల ఫిర్యాదులతో పాటు దేవస్థానాన్ని సందర్శించిన అప్పటి దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ చెర్వుగట్టుపై అపరిశుభ్రత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. ఇందుకుగాను మెరుగైన పారిశుధ్య వ్యవస్థ ఏర్పాటులో పూర్తి అవగాహన ఉండే మునిసిపల్ అధికారుల సలహా తీసుకోవాలని భావించారు. అప్పటి నల్లగొండ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న రమణాచారిని సంప్రదించారు. ఎండోమెంట్ కమిషనర్ విజ్ఞప్తి మేరకు చెర్వుగట్టుపై పారిశుధ్య వ్యవస్థ కోసం హైదరాబాద్‌కు చెందిన ఎన్‌సీపీఈ అనే ఓ ప్రైవేటు కన్సల్టెన్సీతో సర్వే చేసి అంచనా నివేదిక తయారీ చేసే బాధ్యతను ఆయన తీసుకున్నారు. రమణాచారి సూచనల మేరకు ఎన్‌సీపీఈకి చెందిన ఇంజనీర్లు రెండు పర్యాయాలు చెర్వుగట్టు క్షేత్రాన్ని సందర్శించి గుట్టపైన, కింద, గుట్ట చుట్టూ దేవస్థాన స్థలాలను క్షేత్ర పరిశీలనతో సర్వే పూర్తి చేసి వాస్తుదోషాలు లేకుండా ఉండేలా సుమారు రూ.1.93 కోట్ల అంచనాతో డిజైన్ చేసిన డీపీఆర్ నివేదికను నల్లగొండ మునిసిపల్ కమిషనర్‌కు అందజేశారు.



తాత్కాలికంగా ఏర్పాటుచేసిన మురికికాల్వ

సర్వేలో ప్రతిపాదించిన పనులు

చెర్వుగట్టుపై పక్కా మెరుగైన పారిశుధ్యం ఏర్పాటను ఎన్‌సీపీఈ ఇంజనీర్ల బృందం సర్వే చేసి ఇచ్చిన డీపీఆర్‌లో పేర్కొంది. గుట్టపై 520 మీటర్ల నిడివిలో సుమారు రూ.36.63 లక్షల అంచనా వ్యయంతో 300 డయాతో కూడిన సేవరేజ్ లేన్, 2000 మీటర్ల నిడివిలో రూ.64.44 లక్షల అంచనాతో డ్రైనేజీ, వరద నీటి కాల్వ నిర్మాణం, రూ.23లక్షల అంచనా వ్యయంతో 67 చోట్ల మ్యాన్‌హోల్స్ నిర్మాణం, 1,200 మీటర్ల నిడివితో రూ.17.27లక్షలతో సెప్టిక్‌ట్యాంక్ నిర్మాణం, రూ.37.61లక్షలతో క్రాష్ బారియర్, బీంగార్డు బారియర్స్, గాల్వనైజ్డ్ హాట్‌డిప్ ప్రాసెస్, రూ.15లక్షలతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసేలా పనులను ప్రతిపాదించింది.

చర్యలు తీసుకుంటాం

అపరిశుభ్రత సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూపొందించిన ప్రతిపాదనలు కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.శాఖాపరంగా పాలనా, సాంకేతిక పరమైన అనుమతులు రావాల్సి ఉంది. రాగానే పనులు ప్రారంభిస్తాం. అదేవిధంగా రాతి బండ పొరల తొలగింపు పనులను త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తాం. జాతర సమయంలో పనులు నిలిపివేశాం. తర్వాత సదరు కాంట్రాక్టర్‌కు చెందిన బంధువులు మృతిచెందడంతో కొంత ఆలస్యం జరిగింది. వెంటనే పనులు పూర్తిచేసేలా చర్యలు చేపడతాం.

సిరికొండ నవీన్ కుమార్, ఈవో

నిలిచిన....'బండ' తొలిచే పనులు!

చెర్వుగట్టు దేవస్థానం ప్రధానాలయంలో చేపట్టిన రాతిబండ (పొరల) తొలగింపు పనులు రెండు నెలలకు పైగా నిలిచాయి. లింగ రూపుడై గుహలో కొలువైన మూలమూర్తిని భక్తులు దర్శించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రవేశ ద్వారం నుంచి లోపలివరకు అడ్డు తగిలే రాతిబండ పక్కన వంగి స్వామిని చూడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నిటారుగా నిలబడి నిఠలేశ్వరుడిని తనివితీరా చూసేలా ఆలయ లోపలి భాగాన్ని సౌకర్యవంతంగా మలచాలని చేపట్టిన రాతిబండ పొరల తొలగింపు పనులు రెండు నెలలకు పైగా నిలిచిపోయాయి. గత ఏడాది ఆగస్టులో రాతిబండ పొరల తొలగింపు పనులను ప్రారంభించారు. సుమారు రూ.14లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనులను ఆరు నెలల్లోపు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భక్తులు నిల్చునేలా రాతిబండ పొరల తొలగింపు సుమారు 1200 సీఎఫ్‌టీ పరిమాణంలో చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 700 సీఎఫ్‌టీ పరిమాణం వరకే చేయగలిగారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్టు ఉన్న కారణంగా బ్లాస్టింగ్‌కు బదులు బ్లేడ్ కటింగ్ విధానంతో మాత్రమే చేయాల్సి రావడం, పైగా కేవలం ఆలయం మూసివేసిన సమయాల్లో మాత్రమే పనులు చేయాల్సి ఉండటంతో సమయం సరిపోలేదని తెలుస్తోంది. దీంతో రోజుకు 5 నుంచి 6 గంటల వరకు మాత్రమే చేయగలిగారు.

ఇదిలా జనవరి నెలాఖరు వరకు కొనసాగిన పనులు దేవస్థానంలో ఫిబ్రవరి మాసంలో జరిగిన జాతర నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. మిగిలిన 500 సీఎఫ్‌టీ ఏరియా పనిని పూర్తిచేసి తొలచిన పొరల స్థానాన్ని మృదువగా మార్చే పనులు చేయాల్సి ఉంది. అదేవిధంగా స్వామివారి మూలవిరాట్టు దర్వాజ వెడల్పుతో పాటు ఎదురుగా భక్తులు కూర్చుని పూజల్లో పాల్గొనే ప్రాంగణాన్ని పాలిష్ బండలతో సుందరీకరించాల్సి ఉంది.



సగంలో నిలిచిన బండ తొలగింపు పనులు

టైర్ పేలి గాల్లోకి ఎగిరిన కారు

● పల్టీకొట్టి రోడ్డు పక్కన చెట్టుకు ఢీ ● నలుగురికి స్వల్పగాయాలు

చిట్యాల రూరల్, మే 21 : టైర్ పేలడంతో అదుపు తప్పిన కారు గాలిలోకి ఎగిరి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. క్షతగాత్రులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన ఏర్పుల భాస్కర్, ఆయన భార్య సింధూర, వారి కుమార్తె ఏడాది చిన్నారితో పాటు వారికి సంబంధించిన లక్ష్మి, పూజ కారులో కట్టంగూరులో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. మధ్యాహ్నం సమయంలో ఇబ్రహీంపట్నంకు బయలుదేరారు. చిట్యాల మండలం వెలిమినేడు శివారులోకి చేరుకోగానే వారి కారు టైర్ పేలడంతో ఒక్కసారిగా కారు గాలిలోకి 10 అడుగుల మేర ఎగిరి అదుపుతప్పి ఎడమవైపు 30 అడుగుల దూరంలోకి పల్టీ కొట్టి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి ఆగింది. హైవేపై వాహనదారులు కారులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీశారు. ప్రమాదంలో కారులో ఉన్న భాస్కర్, సింధూర, లక్ష్మి, పూజలకు గాయాలు కాగా చిన్నారికి ఎటువంటి గాయంకాలేదు. సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న టోల్‌గేట్ వద్ద ఉన్న జీఎంఆర్‌కు సంబంధించిన 1033 అంబులెన్స్‌లోని ఈఎంటీ శ్రీనివాస్ క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కారు సమీపంలోని వారు ఆందోళనకు గురయయ్యారు. కారు ఎగిరిపడటం, అందులో ఉన్న నలుగురికి గాయాలు కావడం చిన్నారి ప్రాణాపాయం తప్పి క్షేమంగా ఉండటం వారి అదృష్టమని వాహనదారులు తెలిపారు. ప్రమాదంపై చిట్యాల ఎస్ఐ సైదాబాబును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.



చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు

ఆభరణాల అపహరణ

సంస్థాన్ నారాయణపురం, మే 21 : యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణ మండల కేంద్రంలో మంగళవారం చోరీ జరిగింది. ఎస్ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చిలువేరు వెంకులు ఇంట్లో బీరువాలో దాచిన ఐదు తులాల బంగారు ఆభరణాలు, 55 తులాల వెండి ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు. ఈ నెల 9న ఇంట్లో బీరువాలో బంగారు ఆభరణాలతో పాటు పించను డబ్బులను దాచాడు. డబ్బులు అవసరం ఉండడంతో మంగళవారం బీరువా తెరిచి చూసే సరికి దాచుకున్న డబ్బులు ఉన్నా ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశాడు

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విఠల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి విఠల్

నల్లగొండ, మే 21 : గత సీఎం కేసీఆర్ మాదిరిగానే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా నిరుద్యోగులను మోసం చేశాడని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు విఠల్ విమర్శించారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు 10 ఏళ్లలో ప్రజల నుంచి ఎంత వ్యతిరేకత వచ్చిందో ఈ ఆరు నెలల్లోనే రేవంత్‌రెడ్డికి ప్రజల నుంచి అంతే వ్యతిరేకత వచ్చిందన్నారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి కోర్టు పరిధిలో ఉన్న వాటికే ఉద్యోగాలు ఇచ్చి తామే ఉద్యోగాలు ఇచ్చామని రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే నిరుద్యోగ సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కావన్నారు. మెదక్ పార్లమెంట్ ప్రభారి బస్వాపురం లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సదుపాయలపై కౌన్సిల్‌లో ప్రశ్నించేది కేవలం బీజేపీనేనని అన్నారు. సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి,నాయకులు మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, సుభాష్, పోతేపాక సాంబయ్య, జయశ్రీ, రాజశేఖర్, గడ్డం మహేశ్ ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకనే గెలిపించుకోవాలి

నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యలపై కౌన్సిల్‌లో ప్రశ్నించే గొంతుక బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించుకోవాలని సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రభారి వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. ప్రచారంలో భాగంగా ఆయన పట్టణంలోని చర్లపల్లి, సాయిద్వారకాపూరి వంటి కాలనీలో పట్టభద్రులను కలిసి ఓటును అభ్యర్థించారు.

ప్రభుత్వానికి బలం ఉండాలనే వామపక్షాల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ, మే 21: ప్రభుత్వానికి శాసనసభలో ఉన్న బలం మండలిలోనూ ఉండాలని అందుకోసం సీపీఐ, సీపీఎంలు మద్దతు ప్రకటించినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా దేవరకొండ సీపీఐ కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్, పల్లా నర్సింహారెడ్డి, ఇతర నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి పనిచేస్తుండటంతో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న విజయం కోసం సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందన్నారు. కేటీఆర్, హరీ‌శ్‌రావులు మల్లన్నను బ్లాక్‌మెయిలర్ అనడం సరికాదన్నారు. రాష్ట్ర సంపదను బీఆర్ఎస్ నేతలు దోచుకుతిన్నారని, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నగేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి నెలికంటి సత్యం, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, శిరందాసు లక్ష్మమ్మ, కృష్ణయ్య, యూనుస్, వెంకట్రాములు, ఆంజనేయులు, జ్యోతిబసు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలోని ప్రతీ హామీని నెరవేరుస్తాం

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్, దిలీప్‌కుమార్

నల్లగొండ టౌన్, మే 21 : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మళ్లీ అన్ని సంక్షేమ పథకాలు ప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా జాబ్ క్యాలెండర్‌తో పాటు నోటిఫికేషన్‌పై సంపూర్ణ స్పష్టత ఇస్తామన్నారు. జీవో నెంబర్ 46, 317 ఇతర ఉద్యోగుల సమస్యలపై తమ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసి పరిష్కరిస్తుందని భరోసా కల్పించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. మల్లన్నను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్‌లు కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నాయని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పదేళ్లగా నిరుద్యోగులను అన్నివిధాలుగా మోసం చేశాయని విమర్శించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపించాలి: అశోక్‌గౌడ్

నల్లగొండ- వరంగల్- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ కోరారు. మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లన్న జర్నలిస్టుగా అనేక సమస్యలపై పోరాటం చేస్తూ వస్తున్నాడని అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై అతనికి పూర్తి అవగాహన ఉందని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం




చౌటుప్పల్‌లోని రాంనగర్‌లో చెరువును తలపిస్తున్న మురుగు నీరు

చౌటుప్పల్/ చౌటుప్పల్ టౌన్, మే 21: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రత్యేక పాలనకు జిల్లాలో గెజిటెడ్ అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఒక్కో అధికారికి రెండు మూడు గ్రామ పంచాయతీల చొప్పున బాధ్యతలను అప్పగించింది. పంచాయతీ అధికారులతో కలిసి ప్రత్యేక అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రా మాలలో అభివృద్ధిని కొనసాగించాలని ప్రభుత్వం సూచించింది. మూడు నెలలకు పైగా గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతు న్నా కొంతమంది అధికారులు నేటికీ గ్రామాలను సం దర్శించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం, వేసవి లో చాలా గ్రామాలలో మంచినీటి ఎద్దడి నెలకొనడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్య లు ఎవరికి చెప్పుకోవాలో ఎప్పుడు పరిష్కారమవుతా యో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాల నిర్వహణ సైతం అంతంతమాత్రంగానే ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇంకా అనేక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోల ప్రక్రియ పూర్తికాలేదు. అకాల వర్షాలకు కల్లాలలో ఉన్న ధాన్యం తడుస్తూ రైతులు ఇబ్బందుల పాలవుతున్నారు. కొన్ని గ్రామాల్లో మంచినీటి బోర్లు పోయడంలేదని పలువురు పేర్కొం

గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు

టున్నారు. అనేక గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ కూడా కొరవడినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు నెలలుగా సార్వత్రిక ఎన్నికల విధులలో సంబంధిత శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బంది వరకు కూడా ఎన్నికల పనిలోనే ఉన్నారు. గ్రామాలను సందర్శించే పరిస్థితి లేకుండా పోయింది. పాలన పడకేసి ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు పూర్తయినా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



వాయిల్లపల్లి గ్రామంలో రోడ్డుపైకి వస్తున్న మురుగు నీరు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



స్పెషల్ ఆఫీసర్ల పాలనలో గ్రామాలలో సమస్యలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. చాలా గ్రామాలలో పారిశుధ్య సమస్య అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఎన్నికల పనిలో నిమగ్నమయ్యారు. ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

- యాదయ్య గౌడ్, మాజీ సర్పంచ్, అల్లందేవి చెరువు

అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూస్తున్నాం



గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిత్యం చెత్తాచెదారాన్ని శుభ్రం చేయిస్తున్నాం. గామపంచాయతీల్లో నిధులు లేకున్నా కొన్ని సందర్భాల్లో సొంతంగా డబ్బులు వెచ్చించి పనులు చేయిస్తూ ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చాక తీసుకుంటున్నాం. గ్రామాల్లో బోర్ల మరమ్మత్తులు చేస్తున్నాం.

బోయిని వెంకటేష్, గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు

దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం



దోమల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నాం. నాగులకుంటలో అయిల్ బాల్స్ వేయించాం. మురుగు నీటి ప్రాంతాల్లో కెమికల్స్ స్ప్రే చేయిస్తున్నాం. వర్షాలకు ఏర్పడిన మురుగు నీటి నిల్వలను గుర్తించి నివారణ చర్యలను చేపట్టాం. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు.

-ఎన్.వెంకటేశ్వరనాయక్, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

చౌటుప్పల్‌లో మురుగునీటి సమస్య

చౌటుప్పల్ పట్టణంలోని రాంనగర్, గణేష్‌నగర్, నాగులకుంట తదితర ప్రాంతాల్లో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో దోమల బెడద రోజు రోజుకు పెరుగుతోంది. గతంలో కొందరికి డెంగ్యూ వ్యాధి సోకిన సంఘటనలు సైతం ఉన్నాయి. వానా కాలం వచ్చిందంటే చాలు పలు కాలనీల్లోని ప్రజలు దోమల బెడదతో సతమతమవుతుంటారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మునిసిపాలిటీ చర్యలు చేపడుతున్నా..మరిన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.



గణేష్‌నగర్‌లో మురుగు నీటి కాలువ

వాయిల్లపల్లిలో ఇలా..

వాయిలపల్లి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమం గా లేకపోవడంతో మురుగు నీరంతా కాలువలో నుంచి రోడ్లపైకి చేరుతోంది. కాలువలను శుభ్రం చేయకపోవడంతో కాలువలని చెత్తాచెదారంతో నిం డిపోతున్నాయి. చిల్లాపురం గ్రామంలో మురికి కా లువలను శుభ్రం చేయకపోవడంతో కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోయాయి. మురుగునీరం తా ఎక్కడ పడితే అక్కడ నుండి ప్రవహిస్తోంది. అల్లందేవిచెరువు గ్రామంలో చెత్తాచెదారం మురు గు వ్యర్థాలు రోడ్లపై వేయడంతో కాలనీల్లో దుర్వాసన వస్తోంది. నారాయణపురం గ్రామంతో పాటు పలు గిరిజన తండాల్లో మంచినీటి బోర్లు సరిగా పోయడంలేదని పలువురు పేర్కొంటున్నారు.



నీళ్ల ట్యాంకు వద్ద నిలిచిన మురుగునీరు

దత్తత విధానంలోకి తీసుకురావాలి

భువనగిరి టౌన్, మే 21: స్వచ్ఛంద సంస్థల బాలల సంరక్షణ కేంద్రాల్లోకి పిల్లలను దత్తత విధానంలోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. మంగళవారం భువనగిరిలోని నిరీక్షణ చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్‌ను ఆయన పరిశీలించారు. సంరక్షణ కేంద్రాల్లోని అర్హులైన పిల్లలను దత్తతకు ఇస్తే వారి జీవితాలకు మరింత భద్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్, చందనేశ్వరీ, సీడబ్ల్యూసీ ఛైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి.సైదులు చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ దశరథ, ఇన్‌స్టిట్యూషన్ కేర్ అధికారి అలివేలు, డాక్టర్ వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని ఆదరించాలి'

మోత్కూరు, మే 21: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆదరించాలని మోత్కూరు సింగిల్‌విండో ఛైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం మోత్కూరులో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పని చేస్తున్న పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీనివాస్, మార్కెట్ మాజీ ఛైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, నాయకులు కొండ సోంమల్లు, గజ్జి మల్లేష్, అనిల్‌కుమార్, విష్ణుమూర్తి, నరేష్, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

అత్యవసర పనులను వేగవంతం చేయాలి

తుర్కపల్లి, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అత్యవసర పనులను వేగవంతం చేయాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ పసరు లింగారెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఛైర్మన్లతో పాఠశాలల్లో చేపడుతున్న పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభించే లోగా పాఠశాలల్లో మంచి నీటి సరాఫరా, మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు, విద్యుత్ సదుపాయం, మైనర్ రిపేరు వంటి పనులను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి, ఎంఈఓ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు వి. మాలతి, ఆర్. శ్రీనివాస్, స్వరూపారాణి ఉన్నారు.

రహదారిపై ఇసుక మేటల తొలగింపు



జాతీయ రహదారిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

భువనగిరి టౌన్, మే 21: ఇటీవల కురిసిన వర్షాలతో రహదారులపైకి చేరిన ఇసుకతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతుండడంతో పలువురు గాయాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో భువనగిరిలోని జాతీయ రహదారిని, బైపాస్ రోడ్డును గూడూరు టోల్ గేట్ సిబ్బంది శుభ్రం చేస్తునారు. రహదారులపై పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించడంతో పాటు రహదారులను శుభ్రం చేస్తున్నారు.

అధికార పార్టీతోనే సమస్యల పరిష్కారం

భువనగిరి టౌన్, మే 21: రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం భువనగిరిలో విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, మునిసిపల్ మాజీ ఛైర్మన్ బర్రె జహంగీర్, పిట్టల బాలరాజ్. దర్గాయి హరిప్రసాద్, కౌన్సిలర్, ఈరపాక నర్సింహ పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కిష్టయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ అతహర్, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకులు వెనుముల శంకర్‌రెడ్డి కోరారు. మండలంలోని సర్వేల్ గ్రామంలో నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, నాయకులు చిలకరాజు రాజు, సుక్క స్వామి, చెరుకు నరేష్, గుండె రాజేష్ ,యల్లంకి సాయి, యాల్లంకి శ్రీశైలం పాల్గొన్నారు.



భువనగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు: ప్రజల పక్షాన పోరాడే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటి సభ్యురాలు బద్దుల సునీత, క్యాసగల్ల చందు కోరారు. కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు గుండగోని రామచంద్రు, గడ్డం నర్సింహ, అవిశెట్టి అవిలిమల్లు, కోమటి మత్స్యగిరి, బయ్యని రాజు, సుంకర అనిల్, మందుల సురేష్, కూరెళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అధికార పక్షాన్ని ప్రశ్నించడం సాధ్యం



పోచంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్, మే 21: అధికారపక్ష అవినీతి, అసమర్థత, ప్రజా సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించేందుకు బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం భువనగిరిలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి, బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ వైస్ ఛైర్మన్ మాయ దశరథ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, నాయకులు ఎండీ.మహ్మద్, సుర్వి శ్రీనివాస్, నీలం రమేష్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలో నిర్వహించిన ప్రచారంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాయేష్‌కుమార్, నాయకులు గంజి బస్వలింగం తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పాలడుగు, దత్తప్పగూడెం గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, మండల కోఆర్డినేటర్ ఏనుగు జితేందర్‌రెడ్డి, నాయకులు జి.మధుసూదన్, గుంటి సతీష్, కొంపెల్లి గణేష్, బరిగెల శేఖర్, పుల్లయ్య, నరేందర్, శివప్రసాద్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రంలో బీజేపీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, నాయకులు సుర్వి రాజుగౌడ్, జక్కలి రాజు, భాస్కర్ నర్సింహ్మ, వంగరి రఘు పాల్గొన్నారు.

మోటకొండూర్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ రచ్చ శ్రీనివాస్, నాయకులు తండ కృష్ణ, పీసరి తిరుమల్‌రెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, చిర్ర రవీందర్, గాజుల బాలరాజు పాల్గొన్నారు.

సమస్యలకు నెలవుగా జిల్లా ఆసుపత్రి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్



జిల్లా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భువనగిరి టౌన్, మే 21: జిల్లా ఆసుపత్రి సమస్యలకు నెలవుగామారి రోగులకు కొత్త కష్టాలను తెచ్చిపెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. మంగళవారం సీపీఎం నాయకులు జిల్లా ఆసుపత్రికి సందర్శించి పేరుకుపోయిన సమస్యలను పరిశీలించారు. రోగులు, సహాయకులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి అనారోగ్య సమస్యలకు కూడా ప్రైవేట్ లేదా హైదరబాద్ ఆసుపత్రులకు వెళ్లాలని రోగులకు వైద్యులు సూచిస్తుండడం.. జిల్లా ఆసుపత్రి ఇంకా రెఫరల్ ఆసుపత్రిగానే కొనసాగుతుండటం దారుణమన్నారు. పూర్తిస్థాయి వసతులు కల్పించి అన్ని వైద్య సేవలు అందించాలని, ఖాళీలను భర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. మాతాశిశు ఆసుపత్రిని ప్రత్యేకంగా నిర్మించాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, నాయకులు దాసరి పాండు, మాయ కృష్ణ, దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్, ముత్యాలు, శివ, అంజయ్య పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈవో విధులనుంచి తొలగింపు

చౌటుప్పల్ టౌన్, మే 21: చౌటుప్పల్ పట్టణంలోని పీఏసీఎస్ సీఈవో (సెక్రెటరీ) వై.రమేష్‌ను విధుల నుంచి తొలగిస్తూ మంగళవారం డీసీవో ప్రవీణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఛైర్మన్ చింతల దామోదరరెడ్డిని డీసీవో కలిసి రమేష్‌కు సంబంధించిన తొలగింపు ఉత్తర్వుల లేఖను అందజేశారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం వంటి రైతుల ఫిర్యాదులతో ఆదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు రమేష్ ను విధుల నుంచి డీసీవో తొలగించారు. రమేష్‌పై విచారణ కొనసాగుతోంది.

'బెస్ట్ అవైలబుల్'కోసం దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, మే 21: గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు గాను బెస్ట్ అవైలెబుల్ పథకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 10సీట్లు కేటాయించగా మూడో తరగతి విద్యార్థులకు ఐదు సీట్లు, ఐదో తరగతికి మూడు, ఎనిమిదో తరగతిలో రెండు సీట్ల చొప్పున కేటాయించినట్లు, అర్హత, ఆసక్తి గలవారు దరఖాస్తుతో పాటు గ్రామీణ ప్రాంతాల వారు రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారు రూ. 2,00,000లకు వార్షిక ఆదాయం మించరాదని సూచించారు. ఆధార్, రేషన్ కార్డులు, బోనఫైడ్ ధ్రువీకరణ పత్రంతో పాటు దరఖాస్తులపై గజిటెడ్ అధికారి సంతకం, వచ్చే నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల వరకు గిరిజన అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సంక్షిప్తంగా..

భువనగిరి టౌన్: మధుమేహ వ్యాధిగ్రస్తుల కాళ్లపై అయ్యే పుండ్లకు ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చిందని, బాధితులు ఆందోళనకు గురికావద్దని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ వాస్కులర్, ఎండో వాస్కులర్ సర్జన్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ భవిన్ ఎల్‌రామ్ తెలిపారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

వలిగొండ: మండలంలోని అరూరు గ్రామానికి చెందిన బోళ్ల శేఖర్ వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో రూ.2.50లక్షల ఎల్‌వోసీ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, స్వామి, కనకాచారి, అంజయ్య, మహిపాల్‌రెడ్డి, సత్యనారాయణ, లింగయ్య పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: బీజేపీ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాశం భాస్కర్, చందా మహేందర్ గుప్తా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్ఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమ్మేళనానికి నియోజకవర్గంలోని పట్టభద్రులందరూ హాజరుకావాలని కోరారు.

బొమ్మలరామారం: తడిసిన ధాన్యానికి మద్దతు ధర, బోనస్ అందజేయాలని మండల సీపీఐ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి అన్నమైన వెంకటేశం, రైతు సంఘం మండల అధ్యక్షుడు రాజప్ప, మురళి, భారతమ్మ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరలకు ఖండాంతర ఖ్యాతి ఉందని చర్లపల్లి కార్పొరేటర్ బొంత శ్రీదేవి కితాబు పలికారు. భూదాన్‌పోచంపల్లి సందర్శించిన ఆమె చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించారు.

రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుడు గార్లపాటి రవీందర్ గుండెపోటుతో సోమవారం రాత్రి స్వగృహంలో సాహెబ్ నగర్‌లో మృతి చెందారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భువనగిరి అర్బన్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ తెలిపారు. యాదగిరిగుట్టలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు పట్టభద్రుల అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ విజయానికి పార్టీ, ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

తుర్కపల్లి : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండెబోయిన బాలుయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో యువతకు ఆయన సొంత డబ్బులతో క్రికెట్ కిట్‌ను అందజేసి మాట్లాడారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని కోరారు.

మోత్కూరు : రైతులు పండించే అన్ని రకాల ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, మార్కెట్ మాజీ ఛైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

●ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికీ బోనస్ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనాలన్నారు.

రాజీవ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

భువనగిరి టౌన్, మే 21: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జిల్లా ఆసుపత్రిలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాత అని, దేశంలో సాంకేతిక విప్లవానికి ఆయన పాలనలోనే నాంది పడిందని కొనియాడారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, మాజీ ఛైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్లు ఈరపాక నర్సింహ, ఖైరంకొండ వెంకటేష్ నాయకులు తాడూరి నర్సింహ, బిసుకుంట్ల సత్యనారాయణ, ఎండీ సలావుద్దీన్, వడిచర్ల కృష్ణ యాదవ్, బెండ లాల్‌రాజ్, మాదాసు గోవర్ధన్, లయాక్‌అలీ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : భారత రత్న మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని చౌటుప్పల్ మునిసిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మ గౌడ్, కౌన్సిలర్లు ఎండి. బాబాషరీఫ్, బొడిగె బాలకృష్ణ, ఉబ్బు వెంకటయ్య, సందగళ్ల సతీష్, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య, పబ్బు రాజు, ఎం.రమేష్, బి.మురళి, రమేష్ పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.



చౌటుప్పల్‌లో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు : రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం మోత్కూరులో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవిశెట్టి అవిలిమల్లు, స్థానిక నాయకులు కారుపోతుల వెంకట్, మందుల సురేష్, మెంట నగేష్, అవిశెట్టి కిరణ్, కోమటి మత్స్యగిరి, నిమ్మల శ్రీనివాస్, అన్నెపు పవన్, బందెల రవి, అనిల్, నవీన్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు కొనియాడదగినవని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంతో పాటు కొలనుపాక తదితర గ్రామాల్లో ఆయన వర్ధంతిని నిర్వహించారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు అనంతుల నవీన్‌రెడ్డి, నాయకులు సిరబోయిన మల్లేష్‌యాదవ్, భాస్కరుని రఘునాథరాజు, బుగ్గ శ్రీశైలం, భూమండ్ల అశోక్, వంగాల మల్లేష్‌గౌడ్, వంగపల్లి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ రేగు శ్రీనివాస్, రేగు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని 8వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సామల సుధాకర్‌రెడ్డి, గంగదేవి మహేష్, సామల రాజిరెడ్డి, తంతరపల్లి భానుచందర్, మద్ది శివారెడ్డి, బుగ్గ రాజు, బుగ్గ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంస్థాన్‌నారాయణపురం: రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు జక్కిడి చంద్రారెడ్డి, చిలుకూరి శ్రీనివాస్, ఉప్పల నాగరాజు,దూసరి వెంకటేష్, అంతటి స్వామి, గునిగంటి రాజు, రేవనపలి గోపాల్, ఏపూరి గోపాల్, గుర్రం సుదర్శన్ పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి నర్సింహులు, నాయకులు జి.మధుసూదన్‌రెడ్డి, చాడ బాస్కర్‌రెడ్డి, యెలుగల రాజయ్య, ఎంపీటీసీ ధనావతు మోహన్‌బాబు, గుండెబోయిన బాలుయాదవ్, సోమల్ల వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజాపేట: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం రాజాపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ గౌడ్, రాంజీనాయక్, కేదారి, గౌర బక్కయ్య, శ్రీకాంత్, రామ్‌రెడ్డి, సురేష్, శ్రీను పాల్గొన్నారు.